


# అన్నదమ్ములు

మనసూ, మమకారమని ఏదో కవిత్వం చెబుతామే గాని, డబ్బు ముందు కొన్ని ఇబ్బందులముందు ఈ కవిత్వం ఆగ్టరాలేమో. రూపాయికోసం పొరుగువాడి గొంతు కోసిన ఉదంతాలు మనకు తెలిసే వుంటాయి. ఎవడో పరాయివాడు....పరమ విరోధి అనుకుంటే ఆశ్చర్యపడనక్కరలేదు. సొంత తోబుట్టువుల మధ్య ఇల్లాంటి గొటవలు జరుగుతుంటే యింకా మనసేమిటి? మమకారం, గోంగూర వగైరాలకు అర్థమేమిటి ? కోర్టుకెక్కిన అన్న దమ్ముల్నీ, కొట్టుకు చచ్చిన సోదరులను చూస్తున్నప్పుడు నేను అల్లాడి పోతాను, ఎంత మూర్ఖులో గదాని చింతిస్తాను. నాకు తెలీకుండానే వాళ్ళమీద జాలి కలుగుతుంది. ఇంత తెలిసినవాడ్ని అన్నయ్య నాకేదైనా పని చెబితే

వినుక్కుంటాను. అక్కడికి నా ప్రత్యేకత ఏమిటో నాకర్థంకాదు. నేనుకూడా వెధవనే. కాకపోతే తీవ్రమైన వెధవని కాదు అదొక్కటే తేడా....

ఒక్కసారి చిన్న తనపు ముచ్చట్లు నెమరేసుకుందాం. అన్నయ్యా, తమ్ముడూఅనో లేక ఒరే రాముడూ, ఒరే కృష్ణుడూఅనో ఎంతోఆత్మీయంగా పిలుచుకుంటాం. ఒకే కంచంలో తింటాం, ఒకే మంచంలో పడుకుంటాం. నువ్వే నేనంటాం. నేనే నువ్వంటాం. తమ్ముడు చిన్నవాడు, వాడ్ని జాగర్తగా నడిపించుకుని బడికి తీసుకెళ్ళమంటే ఆ అన్న ఓయస్సంటాడు. అన్న నీకంటే పెద్దవాడు, వాడు చెప్పినట్టల్లా వినమంటే తమ్ముడు అట్లాగేనని తలూపుతాడు. ఆ ఇద్దరూ ఒకే గూట్లో కొన్ని సంవత్సరాలు పెరిగి పెద్ద వారవుతారు. తండ్రి కష్టార్జితంతో చదువు కుంటారు. డిగ్రీలు సంపాయించు కుంటారు. ఇంతవరకూ వాళ్ళ బంధుత్వం ఎంతో ఇంపుగా వుంటుంది.

ఆ తర్వాత వాళ్ళకి ఉద్యోగాలొస్తాయి. ఆ పైన పెళ్ళిళ్ళవుతాయి. ఇక అక్కడ్నించి ప్రారంభమవుతుంది. సోదరుల మధ్య రామ రావణ యుద్ధం. రామ లక్ష్మణులనుకున్న ఇద్దరూ రామ రావణులే అవుతారు. నువ్వెంతంటే నువ్వెంతను కుంటారు. ఆ కుర్చీ నాదంటే, ఈ బల్ల నాదంటారు. ఆస్తి పంపకాలంటారు. వేరుపడి తీరాలంటారు. వాడి కెక్కువ యిచ్చి నా కన్యాయం చేసేవని తల్లిదండ్రులను తిట్టి పోస్తారు. మొద ట్నుంచి మీది పక్షపాత బుద్దేనని నిందలు వేస్తారు. ఇద్దర్నీ రెండు కళ్ళుగా ఎంచుకున్న తల్లిదండ్రులు కలత పడతారు. కన్నీళ్ళు పెట్టుకుంటారు. ఒరే నాయన్లారా విడిపోవద్దని ప్రాధేయపడతారు. ఈ వృద్ధాప్యంలో మాకు చింత పెట్టకండని కాళ్ళు పట్టుకుంటారు. ఒక్కడూ కనికరించడు. ఒక్కడూ ఆ ముసిలివాళ్ళని ఖరారు చేయడు. విడిపోతే విడిపోయేరు. తల్లితండ్రులకు కొన్ని ఆంక్షలు విధిస్తారు. మీరు వాడి ఇంటికివెడితే నా గడప తొక్కడానికి వీల్లేదని వాడూ, వీడూ ఇద్దరూ హెచ్చరిస్తారు. ఎవడింటికి వెళ్ళి ఎవడ్ని కాదన్నా ఆ బాధేమిటో కన్నవాళకు తెలుసుగానీ ఈ కోన్‌కిస్కా వెధవలకేం తెలుసు?....

కన్న తల్లితండ్రుల ముందు కుక్కల్లా కొట్లాడుకుంటున్న ఈ ఇద్దరూ కొన్నేళ్ళ క్రింద ఒకే మాట, ఒకే బాట. కొన్నేళ్ళ క్రితమంటే ఎన్నేళ్ళనే ప్రశ్నరావచ్చు. అది వాళ్ళ వాళ్ళ బరువును బట్టి తూకం వేయాల్సిందే కానీ ఇన్నేళ్ళని అందరికీ ఒకటే మాట వర్తింప చేయడం కుదరదు. కట్టుకున్న పెళ్ళాన్ని పరీక్షించాలి. ఆవిడ పవరెంతో అంచనా వేయాలి. ఆమెకు ఎల్లాంటి ఆశలున్నాయో గమనించాలి. అట్లాగే కన్నబిడ్డల్ని ఆరా తీయాలి. వాళ్ళ అశాంతి ఏమిటో తెలుసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యం ఆర్థిక పరిస్థితి. అదెంత తొందర చేసిందో ఖచ్చితంగా కనుక్కోవాలి. వీటన్నిటి దృష్ట్యా కొందరన్నదమ్ములు స్పీడుగా విడిపోతే, కొందరు స్లోగా కత్తుల్ని నూరుతుంటారు. కనుక ఇన్నేళ్ళని కాకుండా కొన్నేళ్ళ క్రితమని చెప్పడమే ఉత్తమం. వారి చిన్నతనంలో అంటే పేచీయే ఉండదు. కొన్నేళ్ళ క్రితం తన కంచంలో ముద్ద తమ్ముడి నోట్లోపెట్టిన అన్నయ్యచేయి ఇప్పుడు తమ్ముడి మెడమీద కత్తిగా వుంటుంది. అన్నయ్య పక్కలోనే సుఖం వుంటుందనుకున్న తమ్ముడు ఇప్పుడు అన్న పక్కలో బల్లెమవుతాడు. అలాంటప్పుడు... లోగడ వాళ్ళ మధ్య అలుముకున్న మమతానురాగాల ప్రస్తుత చిరునామా ఏమిటని అడగండి. అవి కోర్టుకెక్కి సగం చచ్చాయి. ప్లీడర్ల చుట్టూ తిరిగి కొంచెం చచ్చేయి. పరుల హితబోధలతో పూర్తిగా చచ్చేయి.

ఇదొక విచిత్రమైన వ్యవస్థ. ఇందులో బ్రతికే ప్రతిఒక్కడూ ఒకో్క ప్రపంచం. ఈ ప్రపంచంలో సొంత భార్యాబిడ్డలుంటారు. వాళ్ళని అంటిపెట్టుకున్న స్వార్థాలు కొన్ని వుంటాయి. వాటిచుట్టూతా గిరి గీసుకుని బతుకుతాడు మనిషి. అది అతని ప్రపంచం. ఆ ప్రపంచం బాగుపడేందుకు లక్ష మార్గాలు అన్వేషిస్తాడు. పుట్టెడు అబద్ధాలు చెబుతాడు. అన్నయ్యేది, తమ్ముడయ్యేది చివరికి ఆ దేవుడే ఆయ్యేది, డోంట్ కేరంటాడు. నేనూ, నా మనుషులు బతకడం ముఖ్య మంటాడు. మిగతా పాయింట్లన్నీ పట్టించుకో నంటాడు. కొన్నేళ్ళక్రితం....ఒక చిన్న ఇల్లు, ఆ ఇంట్లో ఇద్ద రన్నదమ్ములు కేరింతలు

కొడుతూ ఆడుకుంటున్న దృశ్యం. ఆ ఇద్దర్నీ, వాళ్ళ ఆటల్నీ చూస్తూ మురిసిపోయే అమ్మా, నాన్న. వాళ్ళ కళ్ళల్లో బిడ్డల మీద పెట్టుకున్న రంగు రంగుల ఆశలు, అవన్నీ కనిపిస్తాయి. కరెక్టే. అది చిన్నతనం, తెలిసీ తెలీని తనం. ఆ తనానికి తెర పడిపోయిందిప్పుడు. ఇప్పుడిది మరో అధ్యాయం. ఇందులో కథ వేరు, ఇక్కడ పాత్ర పోషణ వేరు. ఇదిలా జరిగి తీరవలసిందే.

నలభై ఏళ్ళు దాటిన అన్నదమ్ములెవరైనా ఇంకా అన్యోన్యంగా వుంటున్న ఉదంతం విన్నప్పుడు....వాళ్ళు నా కంటికి కనిపించినప్పుడు చేతు లెత్తి నమస్కరించాలని పిస్తుంది నాకు. మా ఊళ్ళో బండి రామయ్య వయస్సు తొంభై. అతని తమ్ముడు లక్ష్మయ్య వయస్సు ఎనభై దాటింది. ఇప్పటికొచ్చి వాళ్ళిద్దరూ ఒకే ఇంట్లో వుంటున్నారు. అన్నయ్యా, తమ్ముడూ అని ఇప్పటికీ పిలుచుకుంటున్నారు. వాళ్ళకి నమస్కారం చేయాలని నేనంటే....వాళ్ళని చెడగొట్టని వాళ్ళ భార్య, పిల్లలకు జై కొట్టమని గ్రంథం టాడు. నిజమే....ప్రేమాభిమానాలు ఎక్కడున్నా అవి పూజింపదగ్గవే.